# పాత కథ

"ఏ వ్యక్తితో నైనా సరే కాసేపు మాట్లాడే అవకాశం దొరికితే చాలు, అతడ్ని గురించి వో కథ రాయటానికి సరిపడే సమాచారాన్ని సేకరించగలను" అని అన్నారు వో సుప్రసిద్ధ ఆంగ్ల రచయిత. ఈ ప్రకటనలో కేవలం ఆయన ప్రజ్ఞ మాత్రమే కాకుండా "ప్రతి జీవితమూ అద్భుతమూ, రసవత్తరమూ అయిన కథావస్తువే అవుతుంది దర్శించగలిగితే" అన్న సత్యం ఇమిడివుందా అనిపిస్తుంది. ఆ ప్రకటనని దృష్టిలో పెట్టుకుని నేనూ వో చిన్న ప్రయోగం చేసింతర్వాత యీ సత్యం బోధపడింది.

* * *

చక్రపాణిని అడిగాను, "మీ జీవితంలో మిమ్మల్ని ఎక్కువగా కదిల్చిన రసవత్తరమైన మరుపురాని అనుభవాలు ఏమైనా వున్నాయా? చెప్పటానికి వీలున్నదా?" అని.

ఆయన చెప్పిన కథ ఇది:

చక్రపాణి చిన్ననాటినుంచి చదువులో అందరికంటే ముందు వుండేవాడు. పోటీలమీద అందరికంటే మంచి మార్కులు తెచ్చుకునేవాడు. తోటి విద్యార్థులు చాలామంది అతని దగ్గరకొచ్చి చదువుకుంటూ వుండేవారు. అలా చదువుకునేవాళ్ళలో అనూరాధ అనే అమ్మాయికూడా వుండేది.

పెద్ద చదువులోకి వచ్చింతర్వాతకూడా ఆ పరిచయాలు అలా వృద్ధిచెందుతూనే వచ్చాయి. ఒకనాడు అనూరాధ చదువుకుందుకు తీసుకువెళ్ళిన పుస్తకం తిప్పి పంపుతూ, అందులో ఒక ప్రేమలేఖనుకూడా వుంచింది. చదువుకుని చక్రపాణి తికమకపడ్డాడు. చిన్ననాటినుంచి పరిచయంవున్నా ఆమె గురించి అతను వేరుగా ఎన్నడూ ఆలోచించివుండలేదు. పరస్పరం ప్రదర్శించుకునే స్నేహసంబంధమైన అభిమానాన్ని ఆమె యిలా అపార్థం చేసుకుందా? ఈ అభిమానాన్ని ఆమె ప్రేమగా రూపొందించుకుందా?" అని అతను కలవరపడ్డాడు. ఈ సంఘటన మొత్తానికి అతనిలో పెద్ద సంచలనాన్ని తెచ్చింది. మొదట్నుంచీ ఎంతో బాధ్యతతో వ్యవహరించటానికి అలవాటుపడిన కుటుంబ భారాన్ని ఒక్క రెక్కమీద మోస్తున్నవాడు కావటంవల్ల ఏపని చెయ్యటానికైనా నాలుగువైపుల్నించి ఆలోచించిగాని అడుగు ముందుకు వెయ్యని మనస్తత్వం అతనికి అలవడివుంది.

ఆమె ముఖతా తన అంతస్సుని విప్పి చెప్పింతర్వాత అతని భావాలు, ఆలోచనలు అదుపుతప్పి అతణ్ని తల్లకిందులు చెయ్యకపోలేదు. "తానుకూడా ఆమెను ప్రేమిస్తున్నాడా"

అని తియ్యగా అనిపించిందతనికి. ఈ అనురాగంబలపడి ఆమెను తలచుకున్నప్పుడల్లా ఆనందంతో కొండంతగా ఉప్పొంగినట్లు అనిపించినా ఆఘాతమంత దిగులు వెన్నంటి కుంగదీస్తూండేది. ఇంత ప్రేమాభిమానాలను ఆమెమీద పెంచుకుంటే చివరికి భగ్నమయితే ,యీ జీవితాలు ఏమయిపోతాయో అనికూడా అతడు ఆలోచించకపోలేదు.

తన ఉత్తరానికి సమాధానం ఆశించిన అనూరాధతో అతను యీ విషయాన్నే చెప్పాడు. "చూడు అనూరాధా, మనము అపార్థం చేసుకోకుండా వుంటే ఒక్కమాట చెబుతాను. నీ అంతట నువ్వు ఆలోచించు, మనిద్దరిపొత్తూ సాధ్య పడేదేనా?"

ఆమె సమాధానం యివ్వలేదు. తల వంచుకునే కూచుంది మూతి ముడుచుకుని.

'ఎందుకు సాధ్యంకాదు?' అని నీ ప్రశ్న. నన్ను వివాహం చేసుకున్ననాడు మనం సమాజాన్ని ధిక్కరించాల్సి వుంటుంది. మన కుటుంబంతో మనకివున్న సంబంధాలన్నీ తెగిపోతాయి. అయినా ఫర్వాలేదు—నా రెక్కలమీద నేను నిలబడగలిగితే. ఆశక్తికూడా ప్రస్తుతం నాకులేదు. నాచదువూ వో కొలిక్కిరాలేదు. పట్టుమని పదిరూపాయలయినా సంపాదించే శక్తి లేనివాణ్ణి నిన్ను ఏం సుఖపెట్టగలను. 'చివరకి ఇన్ని త్యాగాలు చేసి యింతమందినీ కాదని మనకే మనమే భారమైతే ఏమిటి బాపుకునేది?'

ఆమె వులకలేదు _ పలకలేదు.

చివరికి అతను "ప్రేమ అనేది వున్ననాడు ఇలా ఎవరూ చెప్పలేరు. ఇవన్నీ సాకులు – అనుకుంటున్నావు కదూ? జీవితంలో సాహసమొక్కటే చాలదు అనూరాధా? అర్హతలు కావాలి బ్రతకటానికి" అన్నాడతను.

అయినా ఆమె మనసు మార్చుకోలేదు. ఆమె తన్ని అపార్థం చేసుకుంటుందేమో అనే బాధ అతనికి లేకుండా ఆమె చివరికి "మీ మనసు నాకు తెలుసు. నా మనసు మళ్ళించుకోలేకుండా వున్నాను" అని సమాధానం చెప్పింది, ఆఖరి మాటలు సగం బైటకీ సగం లోపలికీ మింగుతూ.

జీవితంలో నిర్మలమైన ప్రేమని పొందగలిగే భాగ్యం ఎందరికి లభిస్తుంది? ఆమెకు తాను తప్ప అన్యమైన యోచన లేదనే తలంపు అతణ్ణి ఆనందంతో ఉక్కిరిబిక్కిరి చేసింది.

"ఒక్క పని చేద్దాం అనూరాధా"

ఆమె కళ్ళలో వెయ్యి దీపాల వెలుగు చూశాడతను.

"జీవితాన్ని తేలిగ్గా అంచనా వెయ్యకూడదు ఒక్క రెండు సంవత్సరాలపాటు ఓపిక పట్టామంటే నేను చదువు పూర్తిచేసుకుని జీవితంలో బ్రతకటానికి అర్హత సంపాదించుకుంటాను."

అతనిమాటలో కొంత ఆశ కలిగిందామెకు. మనసు మార్చాలనే ప్రయత్నంలో తనే మారటం శుభసూచనగా తోచినా, ఆమె పూర్తిగా సంతృప్తి చెందలేదు. తొందరా పడలేదు. ఈ పరిస్థితుల్లో అంతకంటే ఎక్కువగా వత్తిడి తేవటము మంచిదికాదని ఆమెకు తెలుసు.

అతను ఆ మాటా అన్నాడు. "మనసు అర్పించటమనేది ఏ క్షణంలో జరుగుతుందో ఆ క్షణంలో అన్ని వైపుల నుంచి ఆలోచించే సావకాశమూ వుండదు; ఆలోచించినా ఫలితమూ వుండదు."

లక్షసార్లు ఆమె "అవును అక్షరాలా నిజం" అని అనుకున్నది మనసులో.

చక్రపాణి తన కథ చెబుతూన్నప్పుడు నామీద అతనికి వున్న విశ్వాసం, నమ్మిక నాకు గర్వకారణాలయ్యాయి ఇలాంటి రహస్యాలు ఆత్మీయతతోగాని ఎవ్వరూ చెప్పరు. అలా చెప్పుకునే అవకాశంకోసం వాళ్ళు నిరీక్షిస్తారు. ప్రేమ అంటే ఏమిటో పుస్తకాలలో చదవటమేగాని, ఫలానావాళ్ళు ప్రేమించుకున్నారని వినటమేగాని అందులో చిక్కుకున్నవాళ్ళ ద్వారా అతిశయోక్తులూ, కల్పనలూ లేకుండా ఉన్నది ఉన్నట్టుగా చెబుతూంటే వినటం నాకు కొత్త అనుభవం. అతని అనుభవంలో ఉదాత్తత తోచింది నాకు. అతను తన కథ చెబుతూంటే ఎంతో శ్రద్ధా, సానుభూతీ కనబర్చాను.

అతను నిర్దేశించిన గడువు ఆమెకు ఇష్టం లేకపోయినా ఆ క్షణంలో అతణ్ణి ప్రేమించటం వినా ప్రేమని సఫలం చేసుకోవటానికి ఏ మార్గమూ ఆలోచించివుండని ఆమె అలా ఆలోచించాల్సిన అవసరాన్ని గుర్తించగలిగింది.

సమాధానంకోసరం అతను హెచ్చరించేసరికి ఆమెనవ్వి వూరుకుంది కన్నీరు వత్తుకుంటూ. వాన కురిసి వెలిసింతర్వాత

పల్చని ఎండ పరుచుకున్నట్లుగా ఆమె నవ్విందని చక్రపాణి వర్ణించాడు.

ఒకనాడు సాయంత్రం అర్ధాంతరంగా ఆపుచేసిన తన గాథని తిరిగి కొనసాగించాడు చక్రపాణి. అంతవరకూ చాలా తెలివిగా ప్రవర్తించాననే అభిప్రాయంలో ఉన్నవాడల్లా చాలా రోజులతర్వాత ఆమె రాసిన ఉత్తరాన్నిబట్టి చేజేతులా ఆమెను దూరం చేసుకున్నట్టుగా కృంగిపోయాడు.

ఈ కథ యెలా పరిణమించిందో నాకు తెలుసు. ఐతే నాకు తెలిసిందల్లా పర్యవసానంమాత్రమే. వివరాలు తెలియవు.

ఆమె తండ్రి వో సంబంధం స్థిరం చేసుకుని ముహూర్తంకూడా నిశ్చయం చేసుకుని వచ్చేవరకూ అడపా తడపా వయస్సు వచ్చిన పిల్ల పెళ్ళిగురించి తల్లిదండ్రులు చెప్పుకునే మాటలన్నీ నిజం కాబోతాయా అనే అలసటతోనే వుండిపోయిన అనూరాధ బెంబేలు పడిపోయింది. ఒకస్థితిలో వెనకా ముందూ యోచించకుండానే తెలివితక్కువగా మాట్లాడి దొరికిపోయింది. ఇక ఆ తర్వాత జరగవలసిన కట్టడులు, అభ్యంతరాలు, నెత్తిమొత్తుకోవటాలు, బెదరింపులు, నచ్చచెప్పటం అన్నీ జరిగాయి. తండ్రి తెలివైనవాడు. "హూ తెరీ! ఎవడువాడు? చీల్చుతాను, నరుకుతాను" అనకుండా నయానా భయానా పిల్లకే నచ్చచెప్పాలని చూశాడు. "మరొకరయితే ఏం చేసేవారో తెలుసా?" అని తల్లి భయపెట్టింది. ఈ బెదరింపులు, కట్టడులు తట్టుకోలేక "ఇక మీ ఇష్టం" అనేవరకూ ఒత్తిడిచేశారు. అనూరాధ దృష్టిలో అంత మంచి తల్లిదండ్రులూ ఒక్కసారి అర్థంలేని మనుష్యులయిపోయారు

గుట్టు చప్పుడు కాకుండా రెండో ఇంటివాడికి తెలియకుండా జరిగిపోవాల్సిన పెళ్ళివిషయంలో ఇద్దరూ అమాయకంగా ప్రవర్తించామనే తలంపుతో చక్రపాణి కృంగిపోయాడు. చేసిన పొరబాటు కూడదీసుకోవటానికి వీల్లేనిది. "ఏం చెయ్యనని నీ చెప్పు చేతలలో చిక్కుకొనిపోయాను. ఓడిపోయి తల ఒగ్గాను. బందీనై పోయాను" అని చివరిపంక్తులు రాసిందామె.

మొయ్యలేని దుఃఖం ముంచుకు వచ్చిందతనికి.

జరిగిందంతా ఒక కలగా మర్చిపోవటానికి అతను శతవిధాల ప్రయత్నించాడు "ఇక్కడి తప్పెవరిది?" అన్నది ప్రశ్న కాదు. జరగబోయే అవాంఛనీయమైన పరిణామాలను అదుపులో పెట్టనప్పుడు మనసునైనా అదుపులో పెట్టుకోవటం యెలా? — అన్నది ప్రశ్న.

చక్రపాణి చెమ్మగిల్లినకళ్ళను వత్తుకుంటూ అన్నాడు: "కాలం అన్నిటికన్న శక్తివంతమైనది. ఎంతటి విషాదాన్నైనా ఎల్లకాలమూ భరిస్తూ కూర్చోలేము" అని, ఎంతో బరువుగా అతను యెంతో అనుభవంతో అన్నమాటలవి.

రెండు సంవత్సరాలు గడిచిం తర్వాత అనూరాధ ఓమారు చక్రపాణి ఇంటికి వచ్చింది. గృహిణిగా ఎంతో అనుభవాన్ని పెంచుకుంది ఆమె. ఎంతో ఆప్యాయంగా ఒకరి నొకరు పలకరించుకున్నారు. తన సంసారం గురించి ఎంతో గర్వంగా ఎన్నో సంగతులు ఆమె వినిపించింది. ఆమె భర్తకు తనంటే ఎంతో ప్రేమట! తను ఎలాచెబుతే అలా జరిపిస్తారుట!

"సంతోషం అనూరాధా! నే నింకా పరీక్ష పాసు

కాలేదు. జీవితంలో అనుకున్నవి అనుకున్నట్టుగా జరగవు. ఇది మామూలే" అన్నాడు చక్రపాణి.

ఆమె నొచ్చుకుంది అతని ధోరణికి. ఆమె చేతిలోని ఎర్ర రుమాలుమూటని బల్లమీదపరిచి "మిఠాయి తెచ్చాను, తీసుకోండి" అంది.

"మిఠాయి తిన్నతర్వాత రుమాలు నా కిచ్చేస్తావా మరి"

"ఇవ్వకపోతే తినరా?"

ఆమె కిలకిలా నవ్వుతూంటే తనవంతు మిఠాయిని చప్పున గొంతులో వేసుకున్నాడతను.

"ఇంతకీ ఏమిటి విశేషం, తీపి తినిపించావు?"

"ఇవాళ మా అబ్బాయి పుట్టినరోజు"

ఆమెకు వివాహం జరిగిందని తెలిసిం తర్వాతకూడా మనసు సర్దుబాటు చేసుకోలేక ఏ అఘాయిత్యానికి సిద్ధమవుతుందోనని అతను ఆందోళన చెందాడు. ఇంటి ఇల్లాలునేగాక ఈనాటికి తల్లిగా కొత్త బాధ్యతలో కొత్త అనురాగంలో చిక్కుకొనటంతో జరిగిన సంగతులను గురించే ఆ సమానమూ ఆలోచిస్తూ కూర్చొనే నావకాశమూ లేదు; ఉన్నా అంత ఉద్రేకమూ రాదు. ఇక ఆమె గురించి దిగులులేదు. ఆమె కాపరం స్థిరపడిందని తృప్తి చెందాడతను. పుస్తకాలలో మల్లే మనుషులు జీవితంలో ప్రవర్తించలేరు. అలా ప్రవర్తించగలిగి వుంటే ఇలాంటి విషయాల గురించి రాయాల్సిన అవసరం యేనాడో తీరిపోయివుండేది. జీవితంలో మనుష్యులు చేసే

పనులు పుస్తకాలలోకి ఉన్నదున్నట్లుగా వ్రాసే 'పీరు త్తి పిరికి వాళ్ళు' అని పాఠకులు తేలికగా అనేస్తారు. పాఠకుల అంచనాలు పూర్తిగా కాదంటున్నాననుకోకండి. వాళ్ళు వూహిస్తున్నట్టుగా కూడా లోకంలో జరుగుతుంటాయి. కాని అలా జరగటం ఆ మనుష్యుల జీవితపరిస్థితులు, కుటుంబ పరిస్థితులు, సమాజ పరిస్థితులు, వ్యక్తుల సంస్కారాలమీద అధారపడి వుంటాయి. అందులో ఇలాంటి విషయాలు కత్తి అంచుమీద నడకలాంటిది. ఉద్రేకంతో చేసే పొరపాటు ఒకొక్కప్పుడు అఘాతంలోకి తోసేస్తాయి. కొందరు తొందరపడిపోతారు; కొందరు నిగ్రహంతో వ్యవహరిస్తారు.

వయసు ఉద్రేకంలో ఏనాడూ ఇద్దరూ ఒళ్ళు తెలియని స్థితికి పోలేదు. అది ఒక నియమయంగా ప్రవర్తించారు

ఆమె చెబుతున్న ప్రతి సంగతీ అతనిలో ఆందోళననీ వ్యథని, తగ్గిస్తున్న మాట నిజమే అయినా ఏదో వెలితి మాత్రం అతనిలో వుండిపోయింది. "అయ్యో యింకోలా జరిగివుంటే యెంత బావుండేది. ఆమె తనకు దూరం అయిపోయిందే" అనే బాధ తాలూకు వెలితి అది. అది ఎక్కడ బయట పడుతుందోనని జాగ్రత్తగా తూచి తూచి మాట్లాడాడు.

"నా గురించి దిగులు లేదన్నారు, బాగానేవుంది. అలాగే మీ గురించీ నాకు దిగులు వుండకూడదుగా మరి" అంది అనూరాధ ఉన్నట్లుండి.

2)

అతను క్షణం తత్తరపడినా తేరుకుని "ఇప్పుడు నాకేం వచ్చింది?" అన్నాడు.

"ఇన్నాళ్ళూ పెళ్ళెందుకు చేసుకోలేదు."

"చదువు పూర్తయేవరకూ చేసుకోదల్చుకోలేదు."

ఆమె నవ్వు నాపుకుంటూ "ఆ చదువు పూర్తవటం అంటూ వుంటుందా?"

అతను సిగ్గుపడుతున్నట్టుగా తలవంచుకున్నాడు.

ఆమె నిట్టూర్చింది. చివరికి వెళ్ళిపోతూ, ఆమె "ఇలా ఒంటరిగా రావటం మీకిష్టం లేదు కదూ. మీరో ఇంటివారైతే ఇలా సంకోచించాల్సిన పని లేదు" అంది.

"నువ్వు ఎక్కడో అక్కడ కులాసాగా వుంటే అంతే చాలు."

ఆమె ఆగిపోయి వెనక్కి తిరిగి "అంతేనా?" అంది కొండంత దిగులు స్వరంతో. "నే నలా తృప్తిపడలేను సుమండీ. మిమ్మల్ని చూడకుండా వుండలేను సుమండీ" అన్నట్లుగా ఆమె చూసింది అంటాడు చక్రపాణి.

ఎర్ర జేబు రుమాలు వదిలిపెట్టి అనూరాధ వెళ్ళిపోయింది. ఆ జేబురుమాలుతో చెమ్మగిల్లిన కళ్ళను వత్తుకున్నాడు చక్రపాణి.

* * *

ఆ తర్వాత వివాహం విషయంలో అతన్ని ఒప్పించటానికి పెద్దవాళ్ళకు తలకు మించిన వ్యవహారం కాలేదు. వివాహం జరిగింది. సరస్వతి కాపరానికి వచ్చింది. ఎంతో ఆదరిం

చాడు భార్యని. ఆమె మంచితనానికి ముగ్ధుడై గర్వించాడు. ఏడాది తిరగ్గానే కొడుకు తండ్రయాడు. చక్రపాణి అంటాడు. "నేను నా భార్యను ప్రేమిస్తున్నాను. ఆదరిస్తున్నాను. కాని నా అంతస్సులో అనూరాధ స్థానం మటుకు ఇంకొకరు ఆక్ర మించుకోలేరు. అనూరాధ అంతస్సులోనూ నా స్థానం అటు వంటిదే. ఆ సత్యం ఇప్పుడు నాకు బోధపడింది" అని.

సరస్వతితో ఈ గొడవ లేపి అతను ప్రస్తావించదల్చు కోలేదు ఈ సంగతి సరస్వతికి తెలుస్తే చాలా బాధపడ వచ్చు. లోలోపల దాచుకుని మానసికంగా ఆమె కృంగిపో వచ్చు. ఎవరో అనూరాధలాంటి వ్యక్తి తప్పించి అసూయా ద్వేషాలకు అతీతంగా వుండలేరు. అందుకనే ఈ రహస్యం ఆమె దగ్గర దాచాడు సంసారక్షేమంకోసం.

సరస్వతి అతని జీవితంలోకి ప్రవేశించిన తర్వాత అను కోని మార్పులు అతనిలో చాలా వచ్చాయి. ఇప్పుడితని జీవితం ఆగిపోయిన గడియారంలా లేదు. తిరిగి నడక సాగిం చింది. జీవితంలో చిన్న విషయాలయినా, పెద్ద విషయా లయినా అతను శ్రద్ధపడుతున్నాడిప్పుడు. నిరంతరంగా ఆలో చిస్తూ పరాకుగా వుండే అలవాటు తప్పింది. అడుగడు గునా హెచ్చరిస్తూ సరస్వతి అతడ్ని వెన్నంటి వుండేది.

"మేమూ కాపరాలు చేశాంగాని ఇంత అతి భేషజం ఎరగం" అని కొందరు అనుకోక పోలేదు సరస్వతి గురించి.

ఇప్పుడతనికి తాపత్రయాలు పెరిగాయి. బాధ్యతలు పెరిగాయి. కోర్కెలు పెరిగితే వాటంతటవే అన్నీ పెరుగు

తాయి. ఉద్యోగ బాధ్యతలు, ఇంటి బాధ్యతలు, తీరిక సమయంలో కుర్రవాడితో ఆట పాటలు యివన్నీ అతనిలో సంచలనాన్ని తెచ్చాయి.

"ఒక్కసారి అనూరాధ ఈ సంసారం చూడటానికివస్తే బాగుండును. ఎక్కడవుందో ఏమిటో" అనుకున్నాడు, మనసారా ఒకనాడు.

అనుకున్ననాడే ఆమె వచ్చింది, ఆకుపచ్చరంగు రుమాలునిండా యాపిలు పళ్ళు మూట కట్టుకుని. ఆమె గుమ్మంలో అడుగు పెట్టగానే ఆమె కాళ్ళను చుట్టేశాడు బాబు. పల్కించి వస్తూనే ఈ దృశ్యాన్ని చూసిన చక్రపాణి క్షణం ఆశ్చర్యంతో నిలబడిపోయి తేరుకుని స్వాగతం చెబుతూ "నీకు నూరేళ్ళు ఆయుర్దాయం ఇవాళే నీ గురించి అనుకున్నాను" అన్నాడు. "మనకి నూరేళ్ళు ఏనాడో నిండిపోయాయి. ఇది కొత్త జీవితం" అనుకుంది అర్ధ స్వగతంగా బాబుని చంక కెత్తుకుని.

చప్పున కన్నీరు సుళ్ళుతిరిగి శరీరం జల్లుమన్నట్లయిందతనికి.

బాబుని ముద్దు పెట్టుకుని "బాబు మీ పోలికకాదు సుమండీ" అంది.

భార్యకు పరిచయం చేశాడు అనూరాధని, "చిన్నప్పుడు నా దగ్గర చదువుకున్నది" అని.

ముగ్గురూ బయట వరండాలో కూర్చుని చీకటి పడేవరకూ ఆ కబుర్లూ ఈ కబుర్లూ చెప్పుకుంటూ గడిపేశారు.

"ఈ రుమాలు నా కిస్తావా, నేను తీసుకు వెళ్ళనా" అంది అనూరాధ బాబుతో. చేతిలోని ఎర్రజేబు రుమాలుని బాబు గట్టిగా పట్టుకుని తల్లి ముఖంలోకి చూసాడు.

సరస్వతి బాబుని దగ్గరగా తీసుకుని "ఇవ్వను. ఈ జేబురుమాలంటే మా నాన్నకు చాలా యిష్టం అని చెప్పు" అంది.

అనూరాధకి పరిస్థితి అర్థంగాక తికమక పడింది.

చక్రపాణి కంగారు కప్పిపుచ్చుకోవటం ఎవరూ గమనించలేదు.

"పోనీ ఈ ఆకుపచ్చ రుమాలు ఇస్తాను. తీసుకుంటావా?" అంది అనూరాధ ఆమె పచ్చరంగు రుమాలు అందకుండా ఎత్తిపట్టుకుని

బాబు చెయ్యి జాపాడు. ఒక్కవూపున కుర్రవాడ్ని ఎత్తి పట్టుకుని ముద్దుల వర్షం కురిపించింది అనూరాధ.

ఆమె ఆనందానికి అతడు సంతృప్తి చెందినా యింత అతిగా ఆమె ప్రవర్తిస్తే భార్య అనుమానం పడుతుందేమోనని అతని భయం

అనూరాధ వెళ్ళిపోతూ "చాలా సంతృప్తిగా వుంది ఇవ్వాళ" అంది.

తనని సంతోష పెట్టగలిగాననే తృప్తి అతనిముఖంలో అనూరాధ గమనించింది. అంతకంటె కావలసిందేముంది?

ఇంతవరకూ చెప్పి వూరుకున్నాడు చక్రపాణి.

నేను వ్యాఖ్యానించాను: "ఇంత లేతవయస్సులో ఎన్ని అనుభవాలో. ప్రేమించటం, భగ్నమవటం, త్యాగం చెయ్య

టం, ఇంత నిశితమైన అనుభవాలను, ఎలా తట్టుకోగలిగారు? ఆమె అన్నట్లుగా నిజంగా నూరేళ్ళూ నిండి పండిపోయారు మీరు" అని చనువు తీసుకుని చిన్న సలహాకూడా ఇచ్చాను. "ఇంతవరకూ ఈ కధని మీ భార్యకు తెలియకుండా వుంచటం చాలా మంచిదయింది. ఇకముందూ తెలియనియ్యకండి. బయటపడకూడని రహస్యాలు అమాయకంగా బయట పెట్టటం వలనే అనూరాధ యింతవరకూ తెచ్చుకుంది. యింకోసారి అటువంటి పొరబాటు మీరు చెయ్యవద్దు. జీవితాలను ఇలా వెళ్ళనియ్యటమే మంచిది. ఒకసారి అటువంటి పొరబాటుచేస్తే దాని ఫలితాలు జీవిత పర్యంతమూ వెన్నాడుతూనే వుంటాయి" అన్నాను నేను. అటువంటి సందర్భాలు కొన్ని వుదాహరణంగా చెప్పాను.

అంతటితో ఆగిపోతుందనుకున్న కధని తిరిగి పొడిగించాడు చక్రపాణి. అతని మాటలోనే చెబుతాను.

"అనూరాధ వెళ్ళిపోయింతర్వాత చాలాసేపు ఆలోచిస్తూ వుండిపోయాను. అనూరాధ ప్రవర్తనబట్టి ఆమె యిక్కడ వున్నంతసేపూ కొంత యిబ్బంది ఫీలయినట్లు తెలిసిపోతూనేవుంది. ఆమె సరస్వతికి భయపడుతూనేవుంది. సరస్వతి ధోరణికూడా అదోమాదిరిగా వుంది, ఆమె కిలాంటి పరిచయాలంటే యిష్టం వున్నట్లుగాలేదు. ఇక అనూరాధ మా యింటికి రాకపోవచ్చని కూడా నాకనిపించింది. ఈ తలపు రాగానే భార్యకు చెప్పేసి ఆమెను ఎలాగైనా సుముఖురాల్ని చేసుకోవాలనుకున్నాను. మళ్ళీ మరొక ఆలోచన. బలవంతంగా ఆమెను ఒప్పించటానికి నాకున్న హక్కేమిటి ? ఆమె

మీద నాకున్న అధికారాన్ని యిలా దుర్వినియోగం చేసుకోవటం ధర్మమేనా? ఇప్పటికే నలిగిపోయిన ఈ జీవితాన్ని మరింత రభస చేసుకోనా? సరస్వతి ఒకవేళ నన్ను అపార్థం చేసుకోవటమే జరుగుతే అందులో అసందర్భం ఏముంది? ఆ రాత్రి చాలాసేపు యిలా ఆలోచిస్తూ వుండిపోయాను. అర్ధరాత్రి ఎప్పుడో నిద్రపట్టింది.

తెలతెలవారేవేళ కాకులు కూసే సమయంలో ఎవరో తట్టినట్లు కళ్ళు తెరిచి చూశాను. సరస్వతి నా ముఖం మీదకు వంగి జుట్టులోనికి వేళ్ళు పోనిచ్చి "కలవరిస్తున్నారు. రాత్రి చాలా సేపటివరకూ నిద్ర పోలేదు కదూ?" అని అడిగింది.

కళ్ళు నులుపుకుంటూ పరాకుగా "ఏమని కలవరించాను" అన్నాను.

"అనూరాధ - అంటూ ముమ్మారు కలవరించారు. యింకా ఏవేవో అన్నారు. సరిగా వినబడలేదు."

నా గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. ఎలాగూ ఆమెకు తెలిసింతర్వాత దాచి వుంచటం శ్రేయస్కరం కాదని "నీతో ఒక విషయం చెప్పాలని చాలా రోజుల్నుంచి అనుకుంటున్నాను. వింటావా?" అంటూ ఆమె చేతులు చేతుల్లోకి తీసుకున్నాను.

"నాకంతా తెలుసు. మీరేమీ చెప్పనక్కర్లేదు. కొందరి జీవితాలలో మలుపులు యిలాగే వుంటాయి. మీది పెద్దమనసు సుమండీ" అంది ఆమె ఎంతో సానుభూతితో. ఒకప్పుడు అనూరాధ కూడా సరిగ్గా యిలాగే అన్నది.

"నేను నిలువునా ఆశ్చర్యపోయాను. ఆమెముందు సిగ్గు పడిపోయాను. ఆమె ప్రవర్తనలో ఈనాటికీ ఎలాంటి మార్పు నాకు కనిపించలేదు." అని చక్రపాణి తన కథ ముగించాడు.

అనూరాధనీ, చక్రపాణినీ ఉదాత్తంగా చిత్రించుకుని సరస్వతిని లోకంలోని సామాన్యుల జాబితాలో మాత్రమే చేర్చిన నేను తొందరపడి వారికంటె ఆమెను తక్కువ అంచనా వేసినందుకు ఒకప్పుడు చక్రపాణి సిగ్గుపడినట్లుగా, యిప్పుడు నేనూ సిగ్గుపడాను.